క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



లబ్ధిదారుకు ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

కందుకూరు: ఆపదలో వారికి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ఎస్‌. సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ పేర్కొన్నారు. మండలంలోని దెబ్బడగూడకు చెందిన ద్యారంగుల రామాంజన్‌ ఊపిరితిత్తుల వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి ఖర్చులకు సంబంధించి జెడ్పీటీసీ ద్వారా మంత్రి సబితా రెడ్డికి కుటుంబ సభ్యులు దరఖాస్తు చేయగా రూ.లక్ష ఎల్‌ఓసీ మంజూరైంది. ఎల్‌ఓసీ పత్రాన్ని శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ జంగయ్య, నాయకులు రాజేందర్‌రెడ్డి, దశరథ, సర్పంచ్‌ రాంచంద్రారెడ్డి, యూత్‌ అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్‌ దేవీలాల్‌నాయక్‌, నాయకులు ప్రవీణ్‌నాయక్‌, గోవర్ధన్‌, మాజీ మహిళా అధ్యక్షురాలు జయమ్మరాజు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడుచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్‌ సతీష్‌

పహాడీషరీఫ్‌: యువత నేరాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడుచుకోవాలని పహాడీషరీఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ కె.సతీష్‌ అన్నారు. శుక్రవారం పహాడీషరీఫ్‌లోని 14వ వార్డులో కౌన్సిలర్‌ హమీదా దస్తగిరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సిగరెట్‌, గంజాయి, వైట్నర్‌, డ్రగ్స్‌ లాంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. కొందరు అవగాహన రాహిత్యంతో చెడు అలవాట్లకు బానిసలవుతున్నారని అన్నారు. నేరాల నివారణలో ప్రతి పౌరుడు పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా బస్తీల్లో ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మజ్లిస్‌ నాయకుడు దస్తగిరి, ఎస్సైలు వెంకటయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



ఒంటి కాలుపై నిల్చుని నిరసన తెలుపుతున్న కార్మికులు

కందుకూరు: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శుక్రవారం 9వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా కార్మికులు ఒంటి కాలుపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్‌ బాల్‌రాజ్‌ మాట్లాడుతూ.. బంగారు తెలంగాణలో పంచాయతీ కార్మికులను పట్టించుకునే వారు కరువైయ్యారని విమర్శించారు. కేసీఆర్‌ ప్రభుత్వం వారి పట్ల సవతి తల్లిప్రేమ చూపుతుందన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో కారోబార్ల సంఘం అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్‌, కారోబార్‌ యాదయ్య, పంచాయతీ సిబ్బంది రాములు, అంజయ్య, యాదయ్య, గణేష్‌, చిన్నమ్మ, అలివేలు, రాధా, అంజమ్మ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంట్లో బోనాల చెక్కుల పంపిణీ ఏంటి?

కాంగ్రెస్‌పార్టీ ఎల్బీనగర్‌ ఇన్‌చార్జి రాంరెడ్డి

ఎల్బీనగర్‌: బోనాల ఉత్సవాల నేపథ్యంలో నియోజకవర్గంలోని ఆలయాల నిర్వహణకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దొంగచాటుగా పంపిణీ చేయటం సిగ్గుచేటని కాంగ్రెస్‌పార్టీ ఎల్బీనగర్‌ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. చైతన్యపురిలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గతంలో ప్రసన్నాంజనేయ ఆలయంలో కార్పొరేటర్లతో కలిసి బోనాల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే..ఇప్పుడు తన రాజకీయ స్వార్థం కోసం తన ఇంటి వద్ద పంపిణీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సొమ్మును ప్రొటోకాల్‌ పాటిస్తూ పంపిణీ చేయాల్సి ఉండగా, తన సొంత డబ్బు పంపిణీ చేస్తున్నట్టు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. స్థానిక వార్డు కార్యాలయాల్లో పంపిణీ చేయకుండా తన ఇంట్లో పంపిణీ చేయడం సిగ్గుచేటన్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఎమ్మెల్యేకు వత్తాసు పలుకుతున్నారని, ఎల్లప్పుడు ఈ ప్రభుత్వమే ఉండదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు.

మరమ్మతులెన్నడో?

- రోడ్డును తవ్వి వదిలేశారు..
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ఆర్‌ఎస్‌రెడ్డినగర్‌, మీర్‌పేటకు వెళ్లే ప్రధాన రహదారిని తవ్వి వదిలేసిన దృశ్యం

మీర్‌పేట: అసలే ఇరుకు రహదారి..పైగా దారంతా గుంతలమయం. దీనికి తోడు ఓ వైపు రోడ్డును తవ్వారు. మరమ్మతులు చేయడం మరిచారు. వివరాల్లోకి వెళితే. మీర్‌పేట మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి ఆర్‌ఎస్‌రెడ్డి నగర్‌ చౌరస్తా నుంచి మీర్‌పేటకు వెళ్లే ప్రధాన రహదారిలో 8 నెలల క్రితం నూతనంగా మంచినీటి పైపులైన్‌ చేశారు. పనులు పూర్తయిన వెంటనే తిరిగి రోడ్డుకు మరమ్మతులు చేయకుండా సదరు కాంట్రాక్టర్‌ వదిలేశారు. రహదారంతా గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. మీర్‌పేట నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ప్రతి రోజు వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఉన్న కాస్త ఇరుకు రహదారి కూడా గుంతలమయంగా మారడంతో అవస్థలు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

మొదలుకాని పనులు..

కార్పొరేషన్‌లో రోడ్ల అభివృద్ధి, మరమ్మతులకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆర్‌ఎస్‌రెడ్డినగర్‌–మీర్‌పేట ప్రధాన రహదారికి కూడా నిధులు వెచ్చించి టెండర్లు కూడా పిలిచారు. తవ్వి పనులు ప్రారంభించకపోవడంతో ఎదురుగా ఒక వాహనం వస్తే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి. ఏదైనా పెద్ద వాహనం వెళ్లాల్సి వస్తే దాదాపు 10 నిమిషాలు ట్రాఫిక్‌ జాం ఏర్పడుతుంది. దీనికి తోడు రహదారిపై ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానిక షాపుల యజమానులు చెబుతున్నారు. కార్పొరేషన్‌ అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించాలని వాహనదారులు కోరుతున్నారు.

పనులు ప్రారంభిస్తాం..

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణమే పనులు ప్రారంభించేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించడం జరిగింది. వెంటనే రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

–గోపీనాథ్‌, డీఈ, మీర్‌పేట కార్పొరేషన్‌

సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలి



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు

- ఆవుల యాదయ్య ఎన్నిక చెల్లదు, వెంటనే రద్దు చేయాలి
- కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు

మహేశ్వరం: మండల కేంద్రంలోని కాకి ఈశ్వర్‌ ఫంక్షన్‌ హాలులో కాంగ్రెస్‌ మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండల కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడిగా కాకి ఈశ్వర్‌ ముదిరాజ్‌నే కొనసాగించాలని నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల డీసీసీ అధ్యక్షుడు తన లెటర్‌ హెడ్‌ పేరుతో మండల నూతన అధ్యక్షుడిగా నియమించిన ఆవుల యాదయ్య నియామకం చెల్లదని, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, గ్రామశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సంప్రదించకుండా, సమాచారం ఇవ్వకుండా ఆవుల యాదయ్యను నియామకం చేశారని పేర్కొన్నారు. త్వరలో మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించి నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఒంటెద్దు పోకడలను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మండలంలో కాంగ్రెస్‌ పార్టీలో విబేధాలు పక్కనబెట్టి అందరు ఐక్యంగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు నర్సింహా, మంత్రి బాల్‌రాజ్‌, గాంసీరామ్‌ నాయక్‌, రాజునాయక్‌, కేజే.ప్రసాద్‌, రాఘవేందర్‌రెడ్డి, రాజు, దశరథ్‌ నాయక్‌, రాజేందర్‌, ప్రవీణ్‌, కుమార్‌, శివ, సేవ్యా నాయక్‌, పాండు, జంగయ్య పలువురు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్‌: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్‌ డివిజినల్‌ ఇంజినీర్‌ కె.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విజయనగర్‌ కాలనీ, ఆనంద్‌నగర్‌ కాలనీ, ఆలిండియా రేడియో, హనుమాన్‌ నగర్‌, సమతాపురి, రాక్‌టౌన్‌కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. 11కేవీ శ్రీనివాసకాలనీ ఫీడర్‌ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ వాంబేకాలనీ, ఎల్బీనగర్‌, తట్టిఅన్నారం ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. 11కేవీ విజయపురి ఫీడర్‌ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు. 11కేవీ దుర్గానగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. 11కేవీ గణేష్‌నగర్‌, శివపార్వతి ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల విద్యుత్‌ సరఫరా నిలిచిపోనుందని తెలిపారు.

చిన్నారికి అందెల పరామర్శ



చిన్నారి శ్రేయాన్సిని పరామర్శిస్తున్న శ్రీరాములు

బడంగ్‌పేట్‌: బిల్డింగ్‌పై ఆడుకుంటూ కింద పడి గాయపడిన చిన్నారి శ్రేయాన్సిని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌ శుక్రవారం పరామర్శించారు. కార్పొరేషన్‌ పరిధిలోని అల్మాస్‌గూడలో నివాసం ఉంటున్న రజిత ఆంజనేయులు కూతురు శ్రేయాన్సి పైఅంతస్తులో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడింది. దీంతో చికిత్స అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న అందెల వారి నివాసానికి వెళ్లి చిన్నారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆయన వెంట పార్టీ కార్పొరేషన్‌ అధ్యక్షుడు వెంకటర్‌రెడ్డి, కార్పొరేటర్‌ మాధురి, నాయకులు వీరకర్ణారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శూరకర్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవికాంత్‌, జగన్మోహన్‌రెడ్డి కాలనీవాసులున్నారు.

నీటి సరఫరాలో సమయపాలన తప్పనిసరి

కార్పొరేటర్‌ రాజేందర్‌రెడ్డి



జీఎం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

మీర్‌పేట: మంచినీటి సరఫరాలో సమయపాలన పాటించాలని కోరుతూ మీర్‌పేట కార్పొరేషన్‌ 41వ డివిజన్‌ కార్పొరేటర్‌ బొక్క రాజేందర్‌రెడ్డి శుక్రవారం జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధి ఓల్డ్‌ విలేజ్‌లోని కాలనీలకు సమయపాలన లేకుండా మంచినీటిని సరఫరా చేయడంతో ఎప్పుడు నీళ్లు వస్తాయో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 40 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్‌లు పాడైపోయి మంచినీరు డ్రైనేజీలో కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. వెంటనే నూతన పైపులైన్‌లు వేయాలని జీఎంను కోరారు. అలాగే 43వ డివిజన్‌ పరిధిలోని వీకర్‌సెక్షన్‌ కాలనీ, బల్లారి రాఘవనగర్‌, ప్రగతినగర్‌, సాయినగర్‌, ఓంకార్‌నగర్‌ కాలనీల్లో రోజు విడిచి రోజు మంచినీరు సరఫరా చేయాలని కార్పొరేటర్‌ గజ్జెల రాంచందర్‌ జీఎంకు వినతిపత్రం ఇచ్చారు. వారానికి రెండుసార్లు నీటిని సరఫరా చేయడంతో సరిపడా నీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

హుడాకాంప్లెక్స్‌: 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని మహేశ్వరం బీఆర్‌ఎస్‌ యువజన నాయకులు లోకసాని కొండల్‌రెడ్డి సూచించారు. సరూర్‌నగర్‌ మండల పరిధి భగత్‌సింగ్‌నగర్‌లో ఓటరు నమోదు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ప్రజలు జేజేలు కొడుతున్నారని అన్నారు. అర్హులైన యువత తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

133 లబ్ధిదారుల ఎంపిక

తుక్కుగూడ : ప్రభుత్వం బీసీ కులవృత్తులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రవేశపెట్టిన రూ.1 లక్ష రుణం అందజేయడానికి మున్సిపాలిటీ వ్యాప్తంగా 133 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు మున్సిపల్‌ కమిషనర్‌ బి.వెంకట్రామ్‌ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 215 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. దరఖాస్తుదారుల విచారణ అనంతరం లబ్ధిదారులను గుర్తించమని తెలిపారు. త్వరలో రుణాలను అందజేస్తామని చెప్పారు.

'గౌడ' ఆత్మీయ సమావేశం

కందుకూరు: మండల కేంద్రంలోని సీతారామశాస్త్రి ఫంక్షన్‌హాల్‌లో మండల గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జైగౌడ్‌ జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావుగౌడ్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా 364 సంవత్సరాల క్రితమే బహుజనులకు రాజ్యాధికారం దిశగా బాటలు వేసిన సర్దార్‌ సర్వాయి పాపన్నగౌడ్‌ని స్మరించుకున్నారు. మండల కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానం చేసుకున్నారు. కార్యక్రమంలో గౌడ కులస్తులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా 'దళితబంధు' ఇవ్వాలి

బీజేపీ నాయకుడు జేడీకుమార్‌



అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

మీర్‌పేట: దళితబంధు పథకాన్ని బీఆర్‌ఎస్‌ కార్యకర్తలకు మాత్రమే ఇస్తూ పేద దళితులకు అన్యాయం చేస్తున్నారని మీర్‌పేట కార్పొరేషన్‌, బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జేడీ.కుమార్‌ పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన దళితులందరికి దళితబంధు ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ శుక్రవారం జిల్లెలగూడలోని అంబేడ్కర్‌ విగ్రహానికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్‌ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వచ్చాక దళితులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. దళితబంధు పథకాన్ని కూడా సొంత పార్టీ నేతలకే ఇస్తున్నారని ఆరోపించారు. అర్హులైన వారికి దళితబంధు ఇవ్వాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్సీమోర్చా ప్రధాన కార్యదర్శిగా తిప్పర్తి యాదయ్యను నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకులు సూల ప్రభాకర్‌, చెవ్వ శ్రవణ్‌ కుమార్‌, నాయకులు సోమేశ్వర్‌, గడ్డం జగన్‌, ఎం.రఘు, డి.కృష్ణ, తిరుపతిరెడ్డి, జగన్‌ ముదిరాజ్‌, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్‌, తూర్పాటి యాదగిరి, ధర్మకుమార్‌ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ



శిక్షణలో దివ్యాంగులు

బడంగ్‌పేట్‌: అభిశ్రీ ఫౌండేషన్‌, ఏపీడీ సంస్థ సహకారంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని నిరుద్యోగ దివ్యాంగులకు ఐటీఈఎస్‌–బీపీఓ, రిటైల్‌, ఈ కామర్స్‌ కోర్సుల్లో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ, హాస్టల్‌ సౌకర్యం కల్పించనున్నారు. విజయవంతంగా కోర్సు పూర్తి చేసిన దివ్యాంగులకు కావాల్సి పరికరాలతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. నిరుద్యోగ దివ్యాంగులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ అధ్యక్షుడు ఆవుల వెంకటేష్‌ సూచించారు. ఈ కోర్సులకు అర్హత పదవ తరగతి పాస్‌, లేదా ఇంటర్‌ , డిగ్రీ పాస్‌/ ఫెయిల్‌ అయిన 18 నుంచి 35 సంవత్సరాల దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 19న కొత్త బ్యాచ్‌ ప్రారంభమతుంది. ఇతర వివరాలకు 9494808849 సంప్రదించగలరు.

కాంగ్రెస్‌ కిసాన్‌సెల్‌ మండల అధ్యక్షుడిగా ప్రవీణ్‌



మహేశ్వరం: మండల కాంగ్రెస్‌ కిసాన్‌ సెల్‌ అధ్యక్షుడిగా మండలంలోని అమీర్‌పేట్‌కు చెందిన కాంగ్రెస్‌ నాయకులు ఇమ్మడి ప్రవీణ్‌ నియమితులయ్యారు. శుక్రవారం నగరంలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్‌ పార్టీ కిసాన్‌ సెల్‌ చైర్మన్‌ అవినాశ్‌ రెడ్డి నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ మాట్లాడుతూ... మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతానన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ రైతులతో కలిసి ఉద్యమాలు చేస్తామని తెలిపారు. గతంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపట్టిన రైతు సంక్షేమ పథకాలను రైతులకు తెలియజేసి చైతన్యపరిచి కాంగ్రెస్‌ పార్టీలో చేరేలా చేస్తామని పేర్కొన్నారు. మండలంలో కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని వివరించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కిసాన్‌ సెల్‌ చైర్మన్‌, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జిల్లా కిసాన్‌ సెల్‌ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు

కార్పొరేటర్‌ శ్రీవాణి



డీసీపీ సాయిశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న శ్రీవాణి

హుడాకాంప్లెక్స్‌: యువత చెడు వ్యసనాలకు ఆకర్షితులై మత్తుకు బానిసలుగా మారుతున్నారని సరూర్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ ఆకుల శ్రీవాణి ఆవేదన వ్యక్తం చేశారు. మత్తుకు బానిసలుగా మారుతున్న యువతపై నిఘా పెట్టాలని ఎల్బీనగర్‌ డీసీపీ సాయిశ్రీకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. యువత తెలిసి తెలియకో, స్టైల్‌ కోసం ఒకరిని చూసి మరొకరు మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని, అలాంటి వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్‌ ఇవ్వాలని కోరారు. మత్తు పదార్థాల లభ్యతను అరికట్టాలని సూచించారు. నేరాల కట్టడి, శాంతి భద్రతలకు సరూర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అమ్మవారి ఆలయానికి మెట్లు



మెట్లను ప్రారంభిస్తున్న సర్పంచ్‌ మంత్రి సంధ్య, గ్రామపెద్దలు

మహేశ్వరం: గ్రామాభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పని చేస్తానని పెండ్యాల గ్రామ సర్పంచ్‌ మంత్రి సంధ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెండ్యాలలో గ్రామ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దల సహకారంతో కట్ట మైసమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లేందుకు మెట్లను నిర్మాణం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి వార్డులో అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, సీసీ రోడ్లు, ఎల్‌ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేసి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ ఎండీ.గౌస్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు మంత్రి రాజేష్‌, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, వజ్రంరెడ్డి, నరేష్‌రెడ్డి, ఆశోక్‌రెడ్డి, రామకృష్టారెడ్డి, సామయ్య పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

బోనాలకు ఆలయాలు ముస్తాబు



ముస్తాబు చేసిన బడంగ్‌పేట్‌ మహంకాళి టెంపుల్‌



రంగులతో అలంకరించిన కోట మైసమ్మ ఆలయం



మామిడిపల్లి గ్రామంలోని ఆలయాలకు రంగులు వేస్తున్న సిబ్బంది

బడంగ్‌పేట్‌: బోనాల ఉత్సవాలకు ఆలయాలు సిద్ధమయ్యాయి. ఆదివారం జరగబోయే బోనాల వేడుకలకు బడంగ్‌పేట కార్పొరేషన్‌ కేంద్రంలోని పోచమ్మ, కోట మైసమ్మ, ఈదమ్మ, మహంకాళి అమ్మవార్ల గుడులను గత మూడు రోజులుగా అలంకరణ చేసే పనిలో నాయకులు, అధికారులు గ్రామ పెద్దలు నిమగ్నమయ్యారు. గుడులకు రంగులు వేయించడం, ఆలయాలకు పోతురాజుల విన్యాస బొమ్మలు ఆర్ట్‌ వేయించడం, సున్నాలు, పెయింటింగులు వేసించి అందంగా ముస్తాబు చేస్తున్నారు. ప్లెక్సీలు, కట్‌లు, హోర్డింగులు వేయించుకుంటున్నారు. విద్యుత్‌ కాంతులతో అలంకరించి వన్నె తెస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, బీజేపీ వర్గాలు ఎవరికి వారే బోనాల ఉత్సవాల్లో నిరూపించుకునేందుకు ప్రచార ఆర్భాటాలు చేసుకుంటున్నారు. ఈ సారి బోనాలు అంగరంగ వైభవంగా చేసేందుకు ప్రజలు సైతం సిద్ధమయ్యారు. మీర్‌పేట్‌ పోలీస్‌స్టేషన్‌ సిబ్బంది ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు పోలీసులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

పహాడీషరీఫ్‌లో..

పహాడీషరీఫ్‌: ఈ నెల 16న బోనాల పండుగను పురస్కరించుకొని మామిడిపల్లిలోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. గ్రామంలోని అమ్మోరమ్మ దేవాలయం, పోతురాజు దేవాలయం, కోట మైసమ్మ ఆలయం, బండళ్ల పోచమ్మ ఆలయం, ముత్యాలమ్మ ఆలయం, నల్లపోచమ్మ ఆలయాలకు మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించనున్నారు. పోతురాజు ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అమ్మవార్ల ఆలయాలకు శుక్రవారం రంగులద్దారు. ఆయా ఆలయాల వద్ద స్థానిక కార్పొరేటర్లు చక్క శివకుమార్‌, యాతం పవన్‌కుమార్‌ యాదవ్‌లు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.